

## పెద్దూరు పాఠశాలలో ఘనంగా సైన్స్ దినోత్సవ వేడుకలు


**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఎంపిహెచ్ఎస్ పెద్దూరు పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. భారతీయ విజ్ఞాన శాస్త్ర దిగ్గజం సర్ సివి రామన్ ఎఫెక్ట్ కనుగొన్న సందర్భంగా జరుపుకునే జాతీయ సైన్సు దినోత్సవాన్ని పెద్దూరు పాఠశాలలో వివిధ రకాల కార్యక్రమాలతో అత్యంత కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన సైన్స్ ముగ్గులు అత్యంత ఆకట్టుకునేలా ఉన్నాయి. చిత్రలేఖన పోటీ, ఎగ్జిబిట్ల ప్రదర్శన విద్యార్థులలో విజ్ఞాన శాస్త్ర జ్ఞానాన్ని పెంపొందించేలా, ఆలోచన రేకెత్తించేలా ఉన్నాయి.. కాహూట్ ఆన్లైన్ క్విజ్ విద్యార్థులను బాగా అలరించింది.. సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో గణిత, సైన్స్ ఉపాధ్యాయులైన తోట శ్రీనివాస్, జనగాం రాజమల్లు, ఈరబోయిన రవికుమార్, బైరవాణి, నాగుల వీణలను ప్రధానోపాధ్యాయులు ఇతర ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చక్రవర్తుల రమాదేవి, గుండెల్లి రవీందర్, భాగ్యనగర్ మాధవి, లకావత్ ఉమా, కదర్ల కల్పన, నందాల శంకర్, గడ్డి మహేష్ ,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## మహోన్నతమైనది ఉపాధ్యాయ వృత్తి

### రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి




**ప్రజానావ, వేములవాడ:** సమాజంలో ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదని రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి అన్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రేగుల ప్రసాద్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, వృత్తి పట్ల నిబద్ధతే ప్రతి ఉద్యోగిని ఉన్నత స్థాయికి తీసుకెళుతుందన్నారు. ఉపాధ్యాయులుగా ప్రసాద్ సేవలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. అనంతరం రేగుల ప్రసాద్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కిషన్, ప్రధానోపాధ్యాయులు బన్నాజీ, ఉపాధ్యాయులు లక్ష్మణ్, శ్రీనాథ్, రేగుల శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు రేగుల దేవేందర్, సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# 'దహన సంస్కారాలు పథకం' పునరుద్ధరణ

- మున్సిపల్ కౌన్సిల్ తొలి సమావేశం తీర్మానం
- 12 అంశాల ఏజెండాకు ఏకగ్రీవ ఆమోదం
- మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి




**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల పట్టణంలో కొంతకాలంగా నిలిచిపోయిన 101 రూపాయలకే దహన సంస్కారాల పథకాన్ని తిరిగి పునరుద్ధరిస్తున్నట్టు మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి వెల్లడించారు. ఇటీవలీ మున్సిపల్ సాధారణ ఎన్నికలలో విజయం సాధించిన అనంతరం కొలువైన నూతన పాలకవర్గం శనివారం తొలి మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ కౌన్సిల్ సమావేశానికి చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ ప్రజల అవసరాలను, పారిశుధ్య నిర్వహణ, నీటి సరఫరా నిర్వహణ మొదలైన విషయాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన 12 అంశాలతో పొందుపరిచిన



ఎజెండాను ఈ సాధారణ సమావేశంలో ప్రవేశపెట్టగా పాలకవర్గ సభ్యులతో చర్చించి మొత్తం అంశాలను ఆమోదించుకోడం జరిగిందని తెలిపారు. ఇందులో ముఖ్యంగా కార్మిక క్షేత్రమైన సిరిసిల్ల పట్టణంలో మానవునికి లభించే అంతిమ సంస్కారాలు గౌరవంగా లభించాలని ఉద్దేశంతో అన్ని వర్గాల వారిని దృష్టిలో ఉంచుకొని 101 రూపాయలకే దహన సంస్కారాల నిర్వహించుట అనే పథకాన్ని గత పాలకవర్గంలో ప్రారంభించడం జరిగిందని, కానీ కొన్ని అనివార్య కారణాలవల్ల ఆ పథకం మధ్యలోనే ఆగిపోగా ఈసారి పాలకవర్గం మొదటి సమావేశంలోనే విద్యానగర్, నెహ్రూ నగర్ తదితర వైకుంఠధామాలలో మొదటి అంశంగా 101 రూపాయలకే దహన సంస్కారాలను పురపాలక సంఘం ద్వారా నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఇందుకోసం రూ.16.80 లక్షల బడ్జెట్ ను ఒక సంవత్సరం కోసం కేటాయిస్తూ పరిపాలన మంజూరి చేశారు. అలాగే సిరిసిల్ల పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచుటకు స్పెషల్ సానిటేషన్ డ్రైవ్ నిర్వహించడం కోసం రూ.10 లక్షల ను కేటాయిస్తూ తీర్మానించారు. అంతేకాకుండా సిరిసిల్లలో నీటి సరఫరా నిర్వహణలో భాగంగా రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని వివిధ వార్డులలో పవర్ బోర్ల నిర్వహణ గాను 10 లక్షల రూపాయలను కేటాయిస్తూ పరిపాలన మంజూరి ఇస్తూ తీర్మానం ఆమోదించారు. సిరిసిల్ల పట్టణంలోని స్ట్రీట్ లైట్ నిర్వహణకు అవసరమైన మెటీరియల్ కొనుగోలు చేయడానికి ఐదు లక్షల రూపాయలను కేటాయిస్తూ తీర్మానించారు. పురపాలక సంఘం పారిశుధ్య నిర్వహణ సేవలను మెరుగుపరచడంలో భాగంగా అందుకు అనుగుణంగా వివిధ కారణాలవల్ల చెడిపోయిన ట్రాక్టర్లు, బ్లెడ్ ట్రాక్టర్లు, ఆటోలు, జెసిబిలు మొదలగు వాహనాలను మరమ్మత్తులు చేయించాలని తీర్మానించారు. ఇందుకోసం రూ.11.20 లక్షలను మంజూరు చేస్తూ తీర్మానం ఆమోదించారు. ప్రస్తుత రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని మజీద్, ఈద్గాల వద్ద మౌలిక సదుపాయాల కోసం టెంట్లు, లైటింగ్, గ్రీన్ మ్యాట్లు, తాగునీరు మొదలైన ఏర్పాట్ల కోసం రూ. 3 లక్షలను కేటాయిస్తూ తీర్మానం ఆమోదించారు. పట్టణ అభివృద్ధిని ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతిపాదించిన 12 అంశాలు అన్ని ఆమోదం పొందడానికి సహకరించిన మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ ఎండి ఖాదిర్ పాషా, వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్ సభ్యులు, వివిధ విభాగాల మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గుండె జబ్బుతో ఉన్న గర్భిణికి సురక్షిత ప్రసవం

- 29 వారాల శిశువుకు యశోదా ఎన్ఐసీయూలో ప్రాణరక్షణ
- మలక్ పేట యశోదా ఆసుపత్రి వైద్యుల ఘనత

**ప్రజానావ, కరీంనగర్ :** తీవ్రమైన గుండె సంబంధిత సమస్యలతో కూడిన హై-రిస్క్ గర్భధారణ కేసులో యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మలక్‌పేట్ వైద్యులు తల్లిబిడ్డల ప్రాణాలను కాపాడారు. తీవ్రమైన పల్మనరీ ఆర్టీరియల్ హైపర్‌టెన్షన్ (పిఏహెచ్), జన్యుపరమైన గుండె వ్యాధి చరిత్ర ఉన్న 29 వారాలు + 1 రోజు గర్భధారణలో ఉన్న 21 సంవత్సరాల గర్భిణికి అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించి 29 వారాలు + 2 రోజుల ముందస్తు శిశువును సురక్షితంగా ప్రసవించేలా చేశారు. ఈ మేరకు కరీంనగర్ లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యశోద వైద్యులు మాట్లాడారు. అత్యాధునిక ఎన్ఐసియు సంరక్షణలో ఉంచి ముందస్తుగా జన్మించిన శిశువును సైతం ప్రాణాపాయం నుంచి బయటపడేసినట్లు పేర్కొన్నారు. ఈ మహిళకు బాల్యంలో వివిఎస్‌డి (గుండె రంధ్రం) శస్త్రచికిత్స జరిగిన నేపథ్యం ఉంది. తీవ్ర పల్మనరీ హైపర్‌టెన్షన్ కారణంగా గర్భధారణ కొనసాగడం తల్లి ప్రాణాలకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున ప్రసూతి, కార్డియాలజీ, క్రిటికల్ కేర్ మరియు అనస్తీషియా విభాగాల వైద్యులు సమన్వయంతో అత్యవసర ప్రీటర్మ్ లోయర్ సెగ్మెంట్




సిజేరియన్ నిర్వహించారు. క్లిష్టమైన గుండె సంబంధిత గర్భధారణలు, అత్యంత ముందస్తు శిశువుల అత్యవసర పరిస్థితులను నిర్వహించేందుకు అవసరమైన అత్యాధునిక వైద్య సదుపాయాలు యశోదా ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని యశోదా ఆసుపత్రి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు.

# అజిత్ పవార్ విమాన ప్రమాదంపై ప్రాథమిక నివేదిక విడుదల





**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదానికి దాదాపు నెల రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) 22 పేజీల ప్రాథమిక దర్యాప్తు నివేదికను తన వెబ్‌సైట్‌లో విడుదల చేసింది. విమానం నేలపై కూలిపోవడానికి ముందు ఒక పెద్ద చెట్టును ఢీకొట్టినట్లు నివేదికలో వెల్లడైంది. అయితే ప్రమాదానికి కచ్చితమైన సాంకేతిక కారణం ఇంకా స్పష్టంగా తేలలేదు.

### ప్రమాదం ఎలా జరిగింది?

జనవరి 28న బారామతి సమీపంలో ఈ విమాన ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో అజిత్ పవార్ సహా మొత్తం ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. నివేదిక ప్రకారం, విమానం బ్యాలెన్స్ కోల్పోయిన తర్వాత మొదట ఒక చెట్టును ఢీకొట్టి, అనంతరం వేగంగా నేలపై కూలిపోయింది. ప్రమాద సమయంలో ఆ ప్రాంతంలో

### చెట్టును ఢీకొట్టిన తర్వాతే కూలిందని వెల్లడి

దృశ్యమానత సుమారు 2,000 మీటర్ల మేర ఉన్నట్లు డీజీసీఏ తెలిపింది. ప్రమాదం ప్రభావంతో విమానం యొక్క ఫ్లైట్ డేటా రికార్డర్ (ఎఫ్‌డీఆర్), కాక్‌పిట్ భాగం తీవ్రంగా దెబ్బతిన్నాయి. అధిక వేడి కారణంగా ఎఫ్‌డీఆర్ కు నష్టం వాటిల్లిందని నివేదిక పేర్కొంది. అయినప్పటికీ, అందులోని "ముడి డేటా"ను డౌన్‌లోడ్ చేసినట్లు డిజిసిఎ వెల్లడించింది. కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ కూడా సాంకేతికంగా పరిశీలనలో ఉంది. ఈ వ్యవస్థను తయారు చేసిన అమెరికన్ కంపెనీ సహాయంతో బ్లాక్ బాక్స్, సివిఆర్ విశ్లేషణ చేపట్టనున్నారు. యూఎస్ నుంచి నిపుణుల ప్రత్యేక బృందం భారత్‌కు వచ్చి ముడి డేటాను సురక్షితంగా సేకరించి విశ్లేషించనుంది. పైలట్ మరియు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ మధ్య చివరి నిమిషాల్లో జరిగిన సంభాషణలు తుది నివేదికలో వెలుగులోకి వచ్చే అవకాశముంది.

### తుది నివేదిక కోసం నిరీక్షణ

ఇప్పటివరకు విడుదలైనది కేవలం ప్రాథమిక నివేదిక మాత్రమే. బ్లాక్ బాక్స్ సాంకేతిక విశ్లేషణ పూర్తయిన తర్వాతే ప్రమాదానికి అసలు కారణం వెల్లడవుతుంది. ఈ ప్రక్రియకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అజిత్ పవార్ మరణం రాష్ట్ర రాజకీయాల్లో పెద్ద చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. తుది నివేదికపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

# విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజానావ, మంచిర్యాల:** విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం భీమారం మండల కేంద్రంలోని కేజీబీవీని సందర్శించి తరగతి గదులు, వంటశాల, విద్యా బోధన తీరు, పరిసరాల పరిశుభ్రత, పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే భోజనం తయారీ సమయంలో సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నిత్యావసర సరుకులను వినియోగించాలని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. 10వ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. అనంతరం మండలంలోని దాంపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులు తమ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవాలని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణ దశలకు అనుగుణంగా బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయుడు మార్త రమేష్‌కు ఘన వీడ్కోలు

**ప్రజానావ, కౌటాల:** మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సేవలందించిన సామాజిక శాస్త్ర ఉపాధ్యాయుడు మార్త రమేష్‌కు ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా వీడ్కోలు పలికారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంచందర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు ఆయనను సన్మానించారు. మార్త రమేష్ దంపతులకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఆయన సేవలను స్మరించుకున్నారు. ప్రాథమిక పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా, అనంతరం ఉన్నత పాఠశాలలో సామాజిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా అనేక సంవత్సరాలు సేవలందిస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ఆయన క్రమశిక్షణ, విధి నిర్వహణలో నిబద్ధత తాము జీవితంలో ముందుకు సాగేందుకు ప్రేరణగా నిలిచిందని పూర్వ విద్యార్థులు



పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎటుకూరి శ్రీనివాస్, మండల విద్యాధికారులు గవిడే హనుమంతు, పి జయరాజు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం, బీజేపీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



**ఆదిలాబాద్‌లోని 18వ వార్డు తుమ్మల అన్నపూర్ణ కౌన్సిలర్ అభ్యర్థన మేరకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస్ రెడ్డి లబ్ధిదారుడు పూర్ణం విజయ నవీన్ గృహప్రవేశం వేడుకల్లో ఆదిలాబాద్ నియోజకవర్గం ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మసంతోష్ ద్వారా కానుకను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీలేఖ, నరేష్, శరత్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.**

- ప్రజానావ, ఆదిలాబాద్

# నల్ల కుంటకట్ట కబ్జా అడ్డుకున్న అధికారులు

**ప్రజానావ, హత్నూర:** నూతన పరిశ్రమ నిర్మాణానికి ప్రభుత్వ కుంట కట్టను ధ్వంసం చేశారు. ఏకంగా పైపులు వేసి దర్జాగా రహదారి పనులు చేపట్టారు. హత్నూర మండలంలోని చందాపూర్ గ్రామ శివారులో శనివారం కొందరు వ్యక్తులు నూతన పరిశ్రమ నిర్మాణ పనుల కోసం జిన్నారం మండలం నుంచి భారీ సంఖ్యలో టిప్పర్ వాహనాల ద్వారా మొరం మట్టి తెప్పించి కుంట కట్టను తొలగించి రోడ్డు ఏర్పాటు చేస్తున్నారని సమాచారం తెలుసుకున్న హత్నూర తహశీల్దార్ పర్వీన్ షేక్ వెంటనే రెవెన్యూ అధికారి హరిబాబుతో పాటు జీపీఓలను సంఘటన స్థలానికి పంపించి కబ్జాకు గురైన కుంటకట్టను పరిశీలించి రోడ్డు కోసం ఏర్పాటు చేసిన పైప్ లైన్ ను తొలగించారు. ప్రభుత్వ కుంటను కబ్జా చేసిన కట్ట ధ్వంసం చేసిన కేసు నమోదుతో పాటు చట్టరీత్య తీసుకుంటామని ఆర్ఐ హరిబాబు కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీపీఓ పండరీనాథ్, సాయి కుమార్ గౌడ్ తదితరులు ఉన్నారు.



# కల్యాణలక్ష్మి పేదలకు వరం

**ప్రజానావ, గుడిహత్నూర్:** కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదలకు వరం లాంటివని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం గుడిహత్నూర్ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ ఆడే శీల రాజేశ్వర్‌తో కలిసి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లికి ఆర్థిక సహాయం కోసం తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నిఖిల్, డోంగర్ గావ్ సర్పంచ్ అబ్దుల్ రెహమాన్, మాజీ జెడ్పీటీసీ మస్కే మాధవ్, సీనియర్ నాయకులు ససానే మాధవ్, ఆడే క్రాంతి, భివాజీ తదితరులు పాల్గొన్నారు.





# అదనపు కలెక్టర్‌గా శ్రీనివాస్ రావు బాధ్యతల స్వీకరణ

**ప్రజానావ, మంచిర్యాల:** మంచిర్యాల రాజస్వ మండల అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. జిల్లా అదనపు కలెక్టర్ గా పనిచేసిన పి.చంద్రయ్య పదోన్నతిపై జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గా విధులు నిర్వహిస్తున్నారు.

# 5న మహిళలకు పోటీలు

**ప్రజానావ, తాండూర్:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 5న బెల్లంపల్లి ఏరియాలోని మాదారం కమ్యూనిటీ హాల్, గోలేటి సింగరేణి స్కూల్ మైదానంలో మహిళలకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు పర్సనల్ హెచ్ఓడీ ఎస్వీ రాజేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5న సాయంత్రం 4గంటలకు మాదారం కమ్యూనిటీ హాల్‌లో, 6న సాయంత్రం 4గంటలకు గోలేటి సింగరేణి స్కూల్ మైదానంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మహిళా దినోత్సవ ప్రధాన వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనాలనే మహిళలు 6న మధ్యాహ్నం లోపు జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మహిళల ప్రతిభను వెలికితీయడం, ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

# విద్యా కమిషన్ నివేదికపై పీఆర్టీయూ ఆగ్రహం





**ప్రజానావ, నేరడి గొండ:** విద్యా కమిషనర్ సమర్పించిన నివేదిక ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా శాఖ అధ్యక్షుడు ఆడే నూర్ సింగ్, ప్రధాన కార్యదర్శి నవీన్ యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు భవిష్యత్ పౌరులను తీర్చిదిద్దే దేశ నిర్మాతలని పేర్కొన్నారు. వారికి వేతనం కల్పించడం దేశ భవిష్యత్తుకు పెట్టుబడిగా పరిగణించాలని తెలిపారు. విద్యా కమిషన్ చైర్మన్ సమర్పించిన నివేదిక రాష్ట్ర విద్యా అభివృద్ధికి మార్గదర్శకంగా ఉండాలని ఆశించామని, అందులో ఉపాధ్యాయుల వేతనాలు, నియామకాలు, ప్రమోషన్లపై చేసిన సూచనలు ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడు, నలుగురు ఉపాధ్యాయులు ఉండేవిధంగా నియామకాలు చేపట్టాలని, డిజిటల్ విద్య, ఆర్టిఫిషియల్ లెర్నింగ్, మౌలిక వసతులు, వృత్తి విద్య, క్రీడా విద్య వంటి అంశాలను సమన్వయం చేస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి దోహదపడే విధంగా విద్యా విధానం ఉండాలని సూచించారు. నివేదికలోని వివాదాస్పద అంశాలను సవరించి విద్యా నిపుణుల సూచనలు తీసుకొని ముందుకు సాగాలని ప్రభుత్వాన్ని కోరారు.

# అస్మితకు బంగారు పతకం






**ప్రజానావ, మంచిర్యాల:** మంచిర్యాల వాసి విశ్వనాథ్ అస్మిత హైదరాబాద్ జేఎన్టీయూ యూనివర్సిటీలో ఈనెల 27, 28న జరిగిన తైక్వాండో పోటీల్లో బంగారు పథకాన్ని కైవసం చేసుకుంది. అస్మిత వరంగల్ లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. కాలేజ్ తరఫున అండర్ 62 కేజీస్ పోటీలో పాల్గొని విజయం సాధించినందుకు గాను కాలేజ్ శిక్షకులు మంద శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి వెంకటస్వామి, బుచ్చి రామారావు ఆమెను అభినందించారు.

